౮

# డబ్బు

"ఇదుగో, ఎక్కడా?" అనేది పక్కనేవున్న మొగుణ్ణి చూసి రత్తమ్మగారు.

"మన్ను దిన్న పాములా అలా ఊ గుడ్లు మిటకరించక పోతే ఎందుకు పిలిచిందో కాస్త కనుక్కోకూడదూ?" అనేది మొగుడి 'కనుక్కోడం' మీద ఏమాత్రం నమ్మకం లేని రత్తమ్మగారు. అక్షరమ్ముక్క తేడా లేకుండా అచ్చు ఇలాగే నలభైఅయిదేళ్ళు కాపురం చేశారు ఆ పుణ్యాజీవులు! 'ఎందుకు?' అని ఆయన అడిగినపాపాన పోలేదు. 'ఇదిగో, ఇదీ సంగతి' అని ఆవిడ చెప్పనూలేదు.

మాటవరసకు రత్తమ్మగారు కాపురానికి వచ్చిన మొదటి పండుగకు జోగయ్యగారు తెచ్చిన చీరమాటే తీసుకోండి, ఆవిడ ఏంచేసిందని? కొట్టొచ్చే రంగుని చూసింది, కొసనున్న జరీ చూసింది, కొలిచి లెక్కచూసింది, కొత్తదో పాతదో చూసింది: కొట్టుకి తిరగ్గొట్టేసింది. వీధిని పోతున్న

నలుగురైదుగురుని బట్టలమూటల వాళ్ళని కేకేసి, కూకలేసి కదిపేసి, కదలకుండాచేసి... పదింబావలాకు బేరమాడి ఓచీర పుచ్చుకుంది.

"ఇలా అయితే కాపురాలు చేయగల్గుదుమా?" అని బుగ్గమీద వేళ్ళేసుకుంది. ముప్ఫైఅయిదు రూపాయలిచ్చి కొంటుంబత్తూరు జరీచీర కట్టుకుంటేనేగాని, పండగ వెళ్ళదుటో? సంసార్లంకామో!"

పాలసముద్రంమీద పడుకున్నట్లు విష్ణుమూర్తి ఫొటో తీయించుకుంటే తీయించుకున్నాడుగాని, రాత్రివేళయినా అందుమీదికి చేరడానికి వీల్లేని వ్యాపకాలు ఆయనకున్నాయి. ఉత్సవ విగ్రహాలకైనా ఊరేగడానికి వేళలున్నాయి. పసిపాపలకైనా ఉయ్యాల లూగడానికి కాలపరిమితులున్నాయి. ఎల్లకాలం మంచాన్ని కరిచిపెట్టుకుని పడుకోడానికి వీలు లేకుండా రోగులకుసహితం అటోయిటో తేల్చేసే ప్రమాదాలున్నాయి. కాని, తూగుటుయ్యాలమీద ప్రతినిత్యం పడుకునే జోగయ్యగారికి మాత్రం ఆ బాధలు లేవు. నవనవలాడుతున్న శరీరానికి ఎర్రపంచెమాత్రమే ఆయన అలంకారం. జవజవలాడుతున్న బొజ్జకు జంధ్యంపోగుమాత్రమే ఆయన ఆభరణం. తలక్రింద చేతులు తలగడలా పెట్టుకొని ఉయ్యాల బల్లమీద రోజల్లా, రోజల్లా ఏంకర్మ, జీవితమంతా పడుకోగలగడమే ఆయన అదృష్టం. అటూ ఇటూ అల్లరిచేస్తూ, దూలంమీద తిరిగే పిచికల్ని ఆటగా, పాటగా, హాబీగా గమనించగలగడమే ఆయన ఐశ్వర్యం.

రత్తమ్మగారి బంధువులు అనుకున్నారంటే వాళ్ళ తప్పేం లేదుమరి. "కిందటి జన్మలో ఈ సాధ్వి, దేవుడిమీద నవ్వులపువ్వులే వేసిందో, వజ్రాల వాయినాలే ఇచ్చిందో... నోట్లో నాలికలేనివాళ్ళను నూటికి ఒకర్నైనా ఎరుగుదుం, ఈవిడ మొగుడికి నోరే లేదు" అటునుంచి ఇటువస్తూ ఒక ఊపూ ఇటునుంచి అటువస్తూ ఒకవూపూ ఉయ్యాలను ఊపుతుంది రత్తమ్మగారు. కొంచెం కుదిపిందంటే ఆవిడకు చిరాకుగా ఉన్నదనీ, కాస్త గట్టిగా ఊపిందంటే కోపం వచ్చిందనీ పడుకున్నవాడు కిందపడేలా గొలుసులు మెలిదిప్పిందంటే కొంప మునిగిందనీ, ఉయ్యాల ఆపి చేత్తో పట్టుకుంటే అదేదో అతిముఖ్యమైన విషయమనీ జోగయ్యగారు యెప్పుడో గ్రహించేసాడు.

"ఇంట్లో తూగుటుయ్యాల ఉన్నసుఖం పైవాళ్ళకేం తెలుసు?" అనుకుంటాడు. అందుకనే ఆ 'గబ్బ' శ్రీమంతుడు. కాని, "ఇంట్లో నుయ్యివున్న సుఖం మొగాళ్ళకేం తెలుసు?" అనుకుంటుంది ఆ సౌభాగ్యవతి.

అప్పటికప్పుడు ఏ పదిమంది చుట్టాలో దిగిపోతే తెల్లబోయిన గృహిణి, మజ్జిగతప్పేలాలో మరో యిన్నినీళ్ళుపోసి ఏ నిమ్మకాయ డిప్పో పిండడం సహజం. కాఫీకలిపే గిన్నెలో పీకలదాకా నీళ్ళుపోసి దానిమొగాన ఇంత పంచదార తగలెయ్యడం ధర్మం. చారులోనో, పులుసులోనో మరింత ఊటెక్కించి అట్టే మాటాడకుండా ఇంత పోపుపెట్టడం న్యాయం. కాని సొంత ఉపయోగానికే రత్తమ్మగారిలా, ఇంతలా నీళ్లు వాడుకునేవాళ్ళు అరుదు.

"ఆ గంగమ్మతల్లిని నమ్ముకున్నవాళ్ళకు ఏ ఆపదలూ ఉండవు" అనుకుంటుంది ఆ భక్తురాలు.

"రోజుకు కనీసం ఎనిమిది పెద్దగళాసుల మంచినీళ్ళు తాగాలి" అనే ఆరోగ్యసూత్రంతో ఆవిడ నూటికి నూరుపాళ్ళు ఏకీభవిస్తుంది. అరపావు పాలుగాని, అరడ్డా మజ్జిగగాని రోజుకు కొనుక్కుంటే అవే ఆ కుటుంబానికి లెక్క తొక్క అయిపోయాయంటే, ఆ చల్లనితల్లి చిద్విలాసంగాని మరొకటి కాదు.

"పి. రామజోగరావు ఎల్. ఎం. పి. రిజిష్టర్డ్ మెడికల్ ప్రాక్టీషనర్" అన్న హృదయంలేనిబోర్డు అయితే వాళ్ళ వీధిలో వేలాడుతున్నదిగాని, నిజంగా వైద్యం చేసేది రత్తమ్మగారే అని చాలామందికి తెలీదు. నిజానికి నాడి చూడ్డం, నాలికచూడ్డం, ఉష్ణంచూడ్డం ఉష్ణమానినిచూడ్డం ఎవరికి తెలియదుగనుక? రోగులను పిచుకుమ్మందగ్గరే ఆపి, నాలుగూ అడిగి తెలుసుకుని లోపలికివెళ్ళి ఏమివ్వాలో కనుక్కుంటుంది ఆమె. మొగుడు ఇమ్మన్న పొట్లాలలో సగం మాత్రమే ఇచ్చి పుచ్చుకోమన్న డబ్బుకుమాత్రం రెట్టింపు పుచ్చుకుంటుంది ఆమె. వచ్చేటప్పుడూ, వెళ్ళేటప్పుడూ బల్ల మీదవున్న 'మిక్చర్స్'ని చూస్తుంది ఆమె. ఎన్నినీళ్ళు పోసినా ఇంకా అవి ఆమె కంటికి చిక్కగా ఉన్నట్టే కనిపిస్తాయి కాబోలు. గబుక్కున నూతిదగ్గరికి పరిగెడుతుంది.

"ఈయన మొహం, పుస్తకాలుచదివి పరీక్షలైతే పాసయ్యారుగాని ఈయనకొచ్చిన వైద్యం యెంతా ? ఒకవేళ

వస్తే వచ్చిందిగాని ఈ రోగిష్టి చచ్చినాళ్ళదగ్గర్నుంచి నేర్పుగా డబ్బు వడకడం మాటలా?" అంటుంది ఆమె. అందుకే పత్రి, కత్తెరా పట్టుకొని, రోగిరోగ సంహారానికి, ఆపరేషన్ల పేరుతో వీధులమ్మట ఆయన్ని బయలుదేరనివ్వదు. అందుకనే మంచి పేరుతో పాటు ఆయనకు చెడ్డపేరుకూడా లేదు. అందుచేతనే ఆ మహారాజు ఉయ్యాల దిగవలసిన అవసరం లేకపోయింది.

ప్రపంచంలోని ప్రసిద్ధ ఆర్థిక శాస్త్రవేత్తలూ, పొదుపు ఉద్యమదారులూ ఇంత క్రిందా—మీదా ఎందుకు పడతారో రత్తమ్మగారిని యెందుకు అడగరోగాని ఆవిడ 'ఫార్ములా' అతిసూక్ష్మం—అతి సులభం. 'ఎందుకింత కష్టపడతారు? మీ పెరట్లో ఒక అరటిచెట్టూ, ఒక కొబ్బరి చెట్టూ పెంచండి; సగం మీ సమస్యల్ని అవే తీరుస్తాయి' అంటుంది సగర్వంగా. నుయ్యి ఆవిడకు గుండెకాయ అయితే ఈ రెండుచెట్లూ ఊపిరితిత్తులు.

ఎప్పుడేనా వాళ్ళింటికి వెళ్ళిచూడండి—అరటికాయ వేపుడు, అరటిపువ్వు పచ్చడి, అరటి దూటకూర—అంతే కాదు. అరటాకుల్లో భోజనం చెయ్యవచ్చు, అరటిపువ్వు డిప్పల్లో పులుసూఅవీ పెట్టుకోవచ్చు; అరటినారను దారంలా వాడుకోవచ్చు.

కిరోసిన్ స్టవ్‌లమీదకూడా వంటచెయ్యలేక అప్పుడప్పుడు అది సరిగా ఉండక గుప్‌గుప్‌మనివచ్చే మంటల్లాగ ఈకాలపు వయ్యారులు తెయ్‌తెయ్‌మని గెంతవచ్చు. కాని కొబ్బరిమట్టలతో, కొబ్బరి బురికెలతో, కొబ్బరికాయ డిప్ప

లతో వంటచెరుకుఖర్చు దమ్మిడీలేకుండా వంటచేసే రత్తమ్మ గారిని చూడండి — ఎక్కడేనా చలనముందా, నిండుకుంది.

"ఇలా అయితే కాపురాలు చేయగల్గుదుమా?" అని ఆవిడ అందంటే అనదూ? అయితే సంసారపక్షంగా కాపురం చెయ్యడానికి అందరితో అన్ని నిజాలు చెబితే లాభంలేదని ఆవిడ ఉద్దేశం.

"ఏం వండుకున్నారు రత్తమ్మ వదినా ఇవాళ మీ ఇంట్లో?" అని ఏ పొరుగింటి వాలుగంటో అడిగేది.

"ఏమిటో ఓపికలేక ఇవాళ రోజూలా చెయ్యలేక పోయానమ్మా! కాబేజీ, బటాణీవేసి మసాళా కూరచేశాను. బంగాళదుంపలు వేపుడు — పెసరపప్పు పచ్చడి. ఆపైన పప్పూ సాంబారూ. మనిషి పిట్టలావున్నా, తినేది గుప్పెడే అయినా మీ అన్నగారికి నవరుచులూ కావాలి. నీకు తెలియందేముంది?" అనేది.

"మీ దాసీదానికి యేమిస్తారు" అని అడిగితే —

నెలకి పదిహేను జీతం. ఓపూట భోజనం. పొద్దుట మళ్ళీ కాఫీ ఇవ్వాలి. పండుగ పండుగకీ కొత్తకోక" అనేది.

ఆమాటే రత్తమ్మగారు లేకుండా దాసీదాన్ని అడిగితే అదనేది: "ఏటేటి? రత్తొమ్మగోరే? సెయ్యి ఇదపడమే. మూన్నాళ్ల పాసిమెతుకులేనా ఇయాల కూకుని గుటుకా గుటుకా బొక్కుతుంది గాని సెయ్యి యిదపడమే? ఇంట్లో కాసిన అరటికాయలేనా తరుగుతున్నప్పుడు 'ఈ ముక్కలు నాకూ, ఈముక్కలూ నీకూ' అని లెక్కాడుతుండే, ఈ

యమ్మనా సెయ్యి ఇదిఏది? అయితే ఓటిమాత్రం సత్రం. పడిమెలమీద బూర్లొండడంలో ఆరికి ఆరేసాటి."

కార్యవాది అయిన రత్తమ్మగారు మాత్రం ఈముక్కంతా విని విన్నట్టు ఊరుకునేది. తిండికీ, బట్టకూ అంతగా కష్టం చేసుకున్న ఆవిడకు తీరకను లోటేమిటి గనక? ఉయ్యాల ప్రక్క నడవలో గుమ్మంమీద బుర్రెట్టుకుని ఇటుతిరిగి పడుకునేది. జోగయ్యగారు వతిగిలి యిటు తిరిగి పడుకునేవారు. రత్తమ్మ ఎవరిమీదో యేదో దండకం ప్రారంభించేది, ఆయన ఊఁ ఆఁ అనకుండా వినేవారు. అలాగే నిమిషాలు, రోజులూ, రోజులు సంవత్సరాలూ అయిపోయేవి.

* * *

"చదివేవుగదూ మీ పెద్దన్నగారు వ్రాసిన ఉత్తరం? మీ అమ్మగారికి ఆయాసం ఎక్కువైపోయిందిట, వైద్యానికి మీదగ్గరకు పంపిస్తారుట! ఏంజవాబు రాద్దామనుకుంటున్నారు, మాట్లాడరేం? అక్కడికేదో నేను దుర్మార్గురాలినైనట్టూ మీరేమీ యెరగనట్టూను. అంతేగదూ? వంటమనిషి లేకుండా గంపెడు పిల్లలకూ వండించుకు తిన్నన్నాళ్లూ మీ పెద్దన్నగారికి మీ అమ్మగారు బరువనిపించలేదు. ఇప్పుడు ఆవిడకు సంకటం వచ్చిందని బండెక్కం చేస్తారా? ఇవతల వాళ్ళేనా అంత వెర్రివాళ్ళు. ఇంతకీ అంతంత పెద్దరోగాలకు మీమొహం మీరేం వైద్యం చెయ్యగలరని.

"అయినా పెద్దవాళ్ళ బాధ్యత ఇంట్లో పెద్దకొడుకుది గాని మధ్య మీకెందుకు. మీకామధ్య మలేరియా వచ్చి

నప్పుడూ నాకు పురిట్లో జబ్బుచేసినప్పుడూ ఈ బంధువులంతా ఏమయ్యారు ?

"మీకేమైనా గవర్నమెంటు నౌఖరీలా, నెలసరి రాబళ్ళా? ఏం ఆస్తి మేటేసుకు పోయిందని ఇంకా యింకా బంధువులు ఈ యిల్లు నిండిపోతారు? వీళ్ళకున్న హక్కేమిటంట? ఈ రోజుల్లో మనిషికి ఓ మనిషి తోడయినా చచ్చినంత ఖర్చే, అప్పులు చేసి చుట్టాల్ని మేపడం ఎక్కడైనా ఉందిటండీ.

"అయినా చుట్టపు చూపుగా వచ్చినవారు పనై పోగానే [illegible] దిగుతారనే గ్యారంటీ యెక్కడుంది. చాకిరీకి చాకిరీ చెయ్యాలా, డబ్బుకి డబ్బూ పెట్టాలా, చీవాట్లూ, చెప్పుదెబ్బలూ ఆఖర్ని తినాలా. నా వల్ల కాదు బాబూ ... 'ఆహార వ్యవహారే లజ్జానకారే' అని యిలాంటివిషయాల్లో మొహమాటాలు పనికిరావు ఎంతమాత్రం తల్లకాదని వెంటనే రాసెయ్యండి. నన్నుమాత్రం బయట పెట్టేరు గనక — అమాయకురాల్ని. ఆడిపోసుకుంటే అంత కంతా అనుభవిస్తారు...అంతే..."

* * *

"నేనేదో కుంచాలకొద్ది రూపాయలు మూటగడుతున్నానని అంచీలమీద పుట్టింటికి తర్లిస్తున్నానని మీవాళ్ళ అభిప్రాయం. అనుకోనియ్యండి, నాకేం పోయిందిలేదు. ఎవరి పాపాన వాళ్ళే పోతారు. నిజానికి డబ్బుదగ్గిర నాకెవరైనా ఒకటే. ఆ మధ్య మా తమ్ముడికీ నాకూ జరిగిన వ్యవహారం

మీరు విన్నారుగా! వినలేదు కాబోలు. చెబుతా, వినండి. వాడి కోర్టువ్యవహారంమీద వాడేదో ఈ వూరువచ్చి ఇక్కడ కొచ్చాడు. వడ్డీ వ్యాపారాల విషయంలో నాకు యేదో ఒక విషయం బోధపడక 'ప్లీడరుసలహా' చేశాను. చెప్పేడు. కాస్త వున్నవాళ్ళంటే వీళ్ళకెలాకన్నుకుడుతుందో చూడండి. 'ఇదే యింకోళ్ళు దగ్గిరయితే కనీసం పాతిక రూపాయలు గుంజి ఉందును — నాచేత వూరికే లాపాయింటు చెప్పించుకున్నదే కాక కాస్త చిక్కని కాఫీ అయినా పొయ్యవేమే అక్కయ్యా' అని హాస్యమాడేడు. వీడితో యేమిటని వూరుకున్నాను. 'ఓ ఏభై రూపాయలుంటే యిద్దూ. వీలునిబట్టి ఒకటి రెండు నెలల్లో సర్దేస్తాను' అన్నాడు. 'ఏభై కాదు అయిదేనా లే' దన్నాను, నేనెక్కణ్ణించి తెచ్చివ్వను. 'నిన్ననే కాదుటే రైతులొచ్చి అయిదొందలు తెచ్చియిస్తుంటే నా కళ్ళతో నేను చూశానూ? అబద్ధాలుకూడా యెందుకూ?' అన్నాడు. నాకు ఒళ్ళు మండిపోయింది. 'ఈ డబ్బు నీదికాదు, నాది. నా యిష్టం. నాకిష్టంలేదు, నేనివ్వను' అన్నాను. ఆ మాటకి ఇంత పొడుగున లేచాడు. 'కూడా పట్టుకపోతావా' అన్నాడు. 'ఎంగిలిచేత్తో కాకిని కొట్టని నీకు ఎప్పటికైనా నీ తప్పు తెలియక పోతుందా' అన్నాడు. ఇంకా ఎన్నన్నాడో ఈ నోటితో చెప్పలేను. తోడబుట్టినవాడు అన్నన్నిమాటలు నిష్కారణంగా ఆడుతూంటే నిలువునా నీరైపోయాను. కరువురోజులని కాస్త జాగ్రత్తగా నా యింట్లో నేను ఖర్చుపెట్టుకుంటే, వీళ్ళందరికీ ఇంత మంటెందుకు. ఎప్పటికేనా పనికొస్తాయని నాలుగురాళ్ళు వెనకేసుకోడమేనా నేను చేసిన తప్పు. ఒళ్ళుపయీ తెలీ

కుండా ఖర్చుపెట్టి వీధులెమ్మట ముష్టెత్తుకున్నవాళ్ళని మనం ఎందర్ని చూడ్డంలేదు. మాట్లాడరేం."

జోగయ్యగారు మాట్లాడడు. వాదించి, సాధించి, అయిష్టమైన మాటలు అని, పడి, చివరకు ఆడదానికి లొంగి పోయేకంటె మొదట్లోనే 'సర్వధర్మాన్ పరిత్యజ్య' అనే శరణాగతి పొందడమే శ్రేయోదాయకమని ఆయన భావించి నట్లు కనబడుతుంది. కూతురికి సంబంధం కుదిర్చేవిషయంలో స్నేహితుడొకడు సలహా యిచ్చినపుడు ఆయన అవలంబించిన పద్ధతే అది.

"ఒరే రామజోగయ్యా, కాణీకాణీ కూడబెట్టేరు, వడ్డీలకు వడ్డీలిచ్చి యిల్లుకొన్నారు, భూములు వృద్ధి చేసుకున్నారు. పిల్లలకోసం కాకపోతే యిది యింకా యేం చేద్దామని. అమ్మడికి పిఠాపురంసంబంధం రైటుచేశారని విన్నాను. మీకేమైనా మతులున్నాయా? కట్నంలేదని స్కూలు ఫైనల్లయినా పాసవని వాడికిచ్చుకుంటార్రా? ఒక్కగానొక్క కూతురుకదా యే పది, పదిహేనువేలో నీవు కావనుకుంటే ఏ ఇంజనీరో దిగిరాడూ. మీ కుటుంబ క్షేమంకోరి, మీ ఆడపిల్ల మంచిచెడ్డలు విచారించి నేనిలా చెబుతున్నాను. ఇప్పటికేనా మించిపోయిందిలేదు. అవసరం వచ్చినప్పుడు మాటాడని నీ మగతనం ఎందుకు."

"ఏదో మొదట్నుంచీ అదే చక్కబెట్టుకొస్తోంది, దాని మాట కాదనడమెందుకులెద్దూ. అయినా కన్నతల్లికంటె కూతురి క్షేమం ఆలోచించే వాళ్ళెవరు. వీళ్ళందర్నీ మించి

పైన ఆడించే వాడెవడో ఒకడు వుంటాడు కదా!" అని కూడా జోగయ్యగారు పైకి అనలేకపోయారు. అనుకున్న ప్రకారం వాళ్ళమ్మాయి రంగమ్మను పిఠాపురమే యిచ్చారు. చదువు లేకపోయినా రంగమ్మ మొగుడు ఆస్తిలేనివాడేం కాదు. చేత కానివాడు కూడా కాదు. వాళ్ళసంసారం బాగానే నడిచింది. జోగయ్యగారి కొడుకు సుదర్శనానికి పెళ్ళిసంబంధం చూడ్డం విషయంలో కూడా మళ్ళీ ఇంత అల్లరి వచ్చిపడింది. రంగమ్మ కూతురు వకుళం సుదర్శనానికి ఈడే. రంగమ్మ కూతుర్ని తమ్ముడికివ్వాలనుకోడం కూడా సహజమే.

"వీళ్ళూ వాళ్ళూ ఇచ్చే కట్నం మేం ఇవ్వలేకపోము. కలిసి వచ్చిన సంబంధం – కాదనకు. నీ కాళ్ళు పట్టుకుంటా నమ్మా" అంది రంగమ్మ.

"ఏమో నాకేం తెలుసు. మీ నాన్ననడుగు" అంది రత్తమ్మ.

"మధ్యని నాన్న మాట ఎందుకూ? ఈ యింట్లో ఆయనకి దమ్మిడీ అంత జోక్యం లేదని ఎవరికి తెలీదు. నీకిష్టంలేదని చెప్పెయ్యకూడదూ, ఎందుకు యిష్టంలేదో నాతో చెప్పకూడదా?"

"బాగుంది నేనైతే పైకి తేలిపోతాను. ఆయన ఒక్క మాట పైకి చెప్పరు లోతైన మనిషి. ఆయనకుమాత్రం ఆలోచనలు లేవనా, అభిప్రాయాలు వుండవనా."

"వెళ్ళి అడగనా."

"ఆఁ! నీతో చెప్పకేం, అన్నీ తెలుసుండి కొత్తదానిలా మాట్లాడతావేం రంగా? ఒక్కగానొక్క పిల్లదూ, వాడిమీదే ఆయన ఆశలన్నీ వుండొచ్చు ఆయన వుద్దేశమేమిటో అంత సులువుగా పైకిచెబితే యింక లేన్దేముంది?"

రంగమ్మ మొగుడితో ఈ విషయాలన్నీ చెప్పింది.

"కన్న కూతురిముందు లౌక్యం ప్రసాదించేటంతవి ఐందా మీ అమ్మ? ఇలాంటి మనిషితో రేపొద్దున్న మన వకుళం మాత్రం ఎలా వేగగలదని?"

"బాగుందండీ. పిల్లలు సుఖపడతారనిగాని ఇందులో ఆవిడ స్వార్థం యేముందని? తనమటుకు తనైనా ఆవిడ కాణీ పెట్టి ఏమైనా కొనుక్కోడం చూశారా"

"అందుకనే నా విచారమంతా, తనకి కట్నమెంత కావాలో స్పష్టంగా తేల్చెయ్యకూడదూ? నోరూవాయీలేని ఆ జడపదార్థాన్ని అడ్డేసుకోడం దేనికి?"

"మీ కిష్టముంటే మీ అమ్మాయిని యిచ్చుకోండి? లేకపోతే మానుకోండి. ఆ అక్కర్లేని మాటలన్నీ యెందుకు, ఇంతకీ ఈ సంబంధానికే ఇంతగా మనం ఎగబడుతున్నది ఎందుకు, ఆవిడ ఆస్తి చూసేకదా!"

మొత్తమ్మీద యెలా అయితేనేం? పన్నెండు వేల రూపాయలకట్నం ఇచ్చేందుకూ, వియ్యపురాలికి వేరేప్రత్యేకం వెయ్యిరూపాయల లాంఛనాలు యిచ్చేందుకూ నిశ్చయమైంది, పెళ్ళి జరిగిపోయింది.

వకుళం కాపురానికి వచ్చిన మూడో నాటినుంచి రత్తమ్మ సంసారంలో అసలయిన అల్లరి ప్రారంభమయింది. తండ్రిదగ్గర అల్లారుముద్దుగా పెరిగిన ఆ అమ్మాయి అత్తగారి కొద్దితనం అయిదు నిమషాలు భరించలేకపోయింది. వారం రోజులు తిరక్కుండా తండ్రికి వుత్తరం వ్రాసింది, వెంటనేవచ్చి తీసుకెళ్ళిపొమ్మని.

"నాన్నా! అప్పుడప్పుడు అమ్మతో అమ్మమ్మగారి ఇంటికి వచ్చేదాన్నిగాని; అప్పుడు యింకా చిన్నపిల్లనో, లేదా యిప్పుడు ఈ ఇంటి కోడలినైన కారణం చేతో – ఇక్కడ వాళ్ళు యేదైనా జా గాక, మనుష్యుల్లా మాత్రం నాకంటికి కనిపించడం లేదు. నువ్వు చదువుకోకపోయినా సంస్కారంగల వాడివి. అర్థం చేసుకుంటావని నీకే తెగించి ఈ ఉత్తరం వ్రాస్తున్నాను. ఇంకా చదువుకుంటున్నవారూ, ఉద్యోగం చెయ్యనివారూ గనుక మీ అల్లుడినుంచి కాణీ కావలసినా ఇవతలికి రాదు. ప్రాణం పోయినాసరే తాతయ్య నోటినుంచి మాట యివతలికి రాదు. పీకలమీదకు వచ్చినాసరే అమ్మమ్మ మూటనుంచి సయాపైసా కదపదు. ప్రపంచంలో డబ్బులేందే ఏ వస్తువూ రాదుమరి. చిరుతిళ్ళకైతే నేం చిల్లరఖర్చుకైతే నేం రెండ్రూపాయలు మారిస్తేగాని నాకు రోజువెళ్ళదాయె. నువ్విచ్చిన పదిరూపాయలూ యెన్నాళ్ళు ఖర్చుపెట్టను? నోరు మూసుకుని ఈ వారం రోజులూ ఎలాగో కాలక్షేపం చేశాను. క్షణంసేపు నోరుకట్టలేని నేను యికముందు భరించడం కష్టం. వెంటనేవచ్చి యేదో వంకబెట్టి నన్ని చెరవిడిపించు. ఇంటికి వచ్చాక దీని పరిష్కారం ఆలోచించుకుందాం."

ఒక్కొక్కరి అదృష్టమేమోమరి. వకుళాభరణం సమస్యమూడునిమిషాలలో పరిష్కారమైపోయింది. ఆ మూడో నాడు అత్తారిలు విడిచిన ఆ అమ్మాయి అప్పట్లో మళ్ళీ ఆ ఇంటికి రావలసిన అవసరమే లేకపోయింది. భూములకు దగ్గిరగా వుంటామని రంగమ్మ మొగుడు ఆ ముందు యేడే రాజమండ్రికి కాపురం మార్పించేశాడు. ఆఏడు సుదర్శనం బియ్యేస్సీ అయిపోగానే బియ్యాడీలో చేరిపోయి అత్తారింటికే బస మార్చేశాడు.

“ఇదిగో, ఎక్కడా? వింటున్నారుగా వీళ్ళ అఘాయిత్యాలు? అందరూకలసి ఉరెట్టుకోనియ్యండి, నాకేం? నా వూపిరి వున్నన్నాళ్ళుమాత్రం వీళ్ళ దుబారాఖర్చులు సాగనియ్యను: వచ్చిననాడే కనిపెట్టేను కోడలమ్మచిత్రం. పోపు సామాన్లు అన్నీ కలిపి నెలకోసారి కొట్టుకుంటాంకదా, అలాగే ఆవాళ మిరపకాయలూ, ఆవాలూ, ఇంగువా అని వేసి రోట్లో దంచుతున్నాను. వకుళంవచ్చి చూసి ‘ఇదేమిటత్తా?’ అని అడిగింది. ‘అదేమిటత్తా యేనాటికానాడు కూరల్లో పోపు వేసుకోరూ’ అని మళ్ళీఅంది. ‘బాగుందేపిల్లా, ఏ సంసారమేనా బాగానేవుంది. ఏనాటికానాడు కూరవుడికించి వార్చేసి యింత ఉప్పూకారం జల్లుకుని ఈ పోపుగుండ యింత వేసుకుంటే తీరిపోలా. ఏ రోజుకారోజు అర్ధసేరు నూనెలో పోపు వేయిస్తేగాని కూరకి రుచిరాదా ఏమిటి? నూనె దాహం తాగుతామంటే, వీశ నాలుగు రూపాయలుచేసి అమ్ముతున్నారు. హవ్వ!’ అని నోరు నొక్కుకున్నాను. వకుళం

ఒకటే నవ్వు. అలా పావుగంటదాకా నవ్వుతూనే వుంది. దానికెందులో యేమంత విచిత్రం కనిపించిందో నాకు తెలీదు. అయినా, దీన్ని కాదు, దీన్నిలా తయారుచేసిన రంగని అనాలి. అయినా, రంగనని యేం లాభంలెండి, దాని మొగుడిది తప్పంటాను. నా కూతుర్ని మార్చెయ్యడమేగాక తన కూతుర్ని నా మీదికి యిలా ఉసిగొల్పుతున్నాడు. ఉద్ధరించనియ్యండి, నాకేం. నా కళ్ళతో నేను, వకుళం చేసిన ఆ కొంప గుండా మేటవేసుకుపోయే ఖర్చులు చూళ్ళేకపోయేదాన్ని. పోతే పోనియ్యండి. ఈ సుదర్శనంగాడూ అక్కడే చేరనీండి. నాకేం అరదండాలు వేస్తారా. మీతో, చెప్పకేం, నలుగురూ వెళ్ళిపోయాకే నా ప్రాణం హాయిగావుంది. ఏమంటారు, మాట్లాడరేం."

మాట్లాడ్డం ఎప్పుడూ అలవాటులేదుగాని ఒక్కొక్కప్పుడు జోగయ్యగారు ఇటుతిరిగి చూడ్డంమటుకు చేసేవారు ఓ మధ్యాహ్నంవేళ చూడ్డంకూడా మానేశారు; ఆయన గుండెజబ్బు చెప్పాపెట్టకుండా ప్రాణంతీసేసింది.

"రత్తులుగారికి డబ్బుకూ ప్రాణానికీ లంకె. రెండుసార్లు మొగుడికి హార్టు ఎటేక్సు వచ్చాకకూడా ఆవిడ మొగుణ్ణి పక్కనున్న విశాఖపట్నం తీసికెళ్ళి చూపించలేదంటే ఎంతటి కఠినాత్మురాలో సుళువుగా అర్థమౌతోంది..."

"అయ్యో రామ! అంతవరకు యెందుకు: మొగుడికి ఓ బత్తాయిపండుకొని ఇవ్వలేకపోయింది. ఓ పావుశేరు ద్రాక్ష

పళ్లు కొని రసంతీసి ఇవ్వలేకపోయింది. దీని డబ్బుకాపీర్నం మండిపోను,"

ఇలా ఆ చుట్టుపక్కలవాళ్లు విసీ వినపడకుండా నోటి కొచ్చినట్టు దీవించి వదిలిపెట్టారు.

"ఎందుకండీ పాపం ఆవిణ్ణి ఆడిపోసుకుంటారు, తీరి కూచునీ. లోపల్లోపల తినేసి ఆ దిక్కుమాలిన జబ్బు ఓనాడు హఠాత్తుగా ప్రాణం తీసేసిందిగాని అంత తొందరగా అన్యాయం చేస్తుందని ఆవిడమాత్రం కలగందా."

"కలగనకే కాబోలు, పాపం, అప్పటికప్పుడు అంత ఆ స్త్రీ తనపేర రాయించేసుకుంది. లోకంలో యెంతటివాళ్లైనా ఉంటారు."

ఓటమి అన్నది ఎవరికైనా వుండుగాక రత్తమ్మగారికి మాత్రం లేదు. ఆవిడ దిగులందలేదు, కసిగందలేదు ... ఒక గదీ చిన్న వసారామాత్రం తనమటుకు వుంచుకుని మిగిలిన యిల్లంతా అద్దెకిచ్చుకుని హాయిగా కాలక్షేపం చేస్తున్నది. కాని, పాడుబడ్డ నూతిలోని పచ్చనైన మొలక, ఎండుబడ్డ తొఱ్ఱలోని ఎఱ్ఱమూతి చిలక, అంతర్యామి సృష్టిలో అసాధారణాలుకావు. శిల్పంలో చైతన్యం, అల్పంలో ఔన్నత్యం అసంభవాలు కావు. అందుకనే అయిన వారినందరిని కాదని కానిదానికి దేనికో ఆత్మార్పణం చేసుకున్న రత్తమ్మ కూడా అంత్యకాలంలో అపరిమితమైన అంతర్బుద్ధానికి గురికాక తప్ప లేదు.

* * *

రత్తమ్మగారికి తమలపాకులు నమలడం ఓ అలవాటు. ఎన్నోసార్లు అనుకుంది డబ్బు ఖర్చుపెట్టించే ఈ వ్యసనానికి గురికాకూడదని. కాని రోజుకు ఓ అర్ధణా ఆకులైనా వేసుకోందే వుండలేదు.

"తమలపాకులు కొనుక్కోడం దేనికి నాన్నమ్మా. ఓ తీగ తెచ్చి మనమే యింట్లో పాతుకోకూడదూ!"

మనవరాలి క్లుప్తం చూచి ప్రాణం లేచొచ్చింది ఆవిడకు. ఎన్నోసార్లు తీగ తెచ్చి ఆవిడ వెయ్యనూ వేసింది, ఆ తీగ చావనూ చచ్చింది. అదే సంగతి పాప జ్ఞాపకం చేస్తే ఆమెకు చెప్పలేని అభిమానం పుట్టుకువచ్చింది. పిల్లనెత్తుకుని ముద్దులవర్షం కురిపించింది.

"నా తల్లే, మా బాబే... నీలో వెయ్యోవంతు జ్ఞానం మీ అమ్మకున్నా అమ్మమ్మకున్నా బంగారు మేడల కడుదురు!"

స్కూలుపనిమీద సుదర్శనం వారంరోజులై తల్లి ఉన్న వూరు వచ్చాడు. వస్తూంటే ఐదేళ్ళ పెద్దకూతురు అల్లరిపెట్టింది, తనూ వస్తానని. తీసుకు వచ్చాడు. తన భవబంధాలను ఏనాడో తెంపుకుని పారమార్థిక చింతతో కాలం గడుపుతున్న రత్తమ్మకు మనవరాలు ఓనాటికోనాడు చేరికై, చేరువై, విప్పలేని చిక్కుఅయిపోయింది.

"నాన్నమ్మా, నీ కెవ్వరూ ఆడుకోడానికి లేరా" అంటుంది.

2)

"నాకమ్మా, ఒక్కదానికీ నీకెక్కడేం తోస్తుంది, మాతో వచ్చెయ్యవూ" అంటుంది.

ఆ పిల్ల వచ్చిన మూడో రోజు ఉదయాన రత్తమ్మకి ఓ ఆలోచన తట్టింది. ఈ పిల్లకు ఓ పది రూపాయలు పెట్టి ఓ శుభ్రమైన జరీ పరికిణీ కుట్టిద్దామా అని. ఇలాంటి ఆలోచన జీవితంలో అంతకుముందెప్పుడూ తోచక ఆమెకు తనకు తనకే అది చిత్రం అనిపించింది.

"ఓరే సుదర్శనం!"

"ఏం అమ్మా."

"చూడూ, ఈ పదిరూపాయలనోటు తీసి కెళ్ళి..."
ఎవరో చెయ్యిపట్టుకుని ఆపినట్టు టక్కున ఆగిపోయింది రత్తమ్మ. అయ్యబాబోయి! పదిరూపాయలనోటు మార్చడమే! అందులో ఒక్క పరికిణీకోసమా? అయిదుజాకెట్లు వస్తాయి, ఇంకె లాంగూలొస్తాయి. ఇలా అయితే కాపురాలు చెయ్యగలుదుమా? ఇది డబ్బా, మన్నా? కుక్కలు గణించడం లేదుగా! దులిపితే రాలడానికి రూపాయల చెట్టు లేదుగా!

"ఏమిటమ్మా, ఈ పది రూపాయలనోటు తీసి కెళ్ళి..."

"... చిల్లర మార్చుకురా, పనుందీ, అందుకూ..."

"నాన్నమ్మా, చిరిగిసరవిక కట్టుకుంటావేం? పాపం నీకు డబ్బుల్లేవూ."

రత్తమ్మ ఉలిక్కిపడింది. తనెందుకు పాపకి బట్టలు

తెప్పించలేకపోయింది, తన ఏమిటి అడ్డగించింది? ఏమిటి జయించింది?

"నా మొహంలా వుంది, నేను డబ్బు జాగ్రత్తగా ఖర్చు పెట్టలేకపోతున్నాను కాబోలు!" అనుకుంది ఆమె. ఈ ఆలోచనకు త్రుళ్ళిపడింది.

కూతురు అత్తవారింటికి వెళ్ళిపోయిననాడు ఆమె అనుకుంది: "డబ్బు జాగ్రత్త దీనికేం తెలుసు దీని బుర్ర! ఇంట్లో వుంటే ఓసారి కాకపోతే ఓసారయినా దీనిచేతికి తాళాలివ్వవలసి వచ్చేది, ఇప్పుడా బాధలేదు.

కోడలు పుట్టింటికి వెళ్ళిపోయిననాడూ అంతే.

"ఏమిటో కొడుకూ కోడలూ ఉద్ధరిస్తారంటారు, వీళ్ళ చేతికి యే నమ్మకంతో ఆస్తులు అప్పచెప్పగలం గనక..."

భర్త బ్రతికున్నప్పుడూ అంతే. ఆయన జబ్బుతో వున్నప్పుడు అనేక విధాల ఖర్చుపెట్టవలసి వచ్చేది. తనకిది కావాలని ఆయన తనకై తాను యేనాడూ అడిగి యెరుగరు కాని... 'అలా వున్నారుగాని యేం ఖర్చుపెడితే ఈయన వద్దంటారు గనుక?' అనిపించేది. ఇప్పుడు తనూ, డబ్బూ, ఇంకెవ్వరూ లేరు. ఆ సంతా తనపేరునవుంది, తన యిష్టం, అయినా, 'నేనేమీ దుబారా చేసెయ్యడంలేదుగదా?' అన్న ఆలోచన ఆమెకెందుకు వచ్చింది. తన్నుతనే నమ్మడంలేదా.' ఈ ఆలోచన రత్తమ్మను వెన్నాడింది. వెన్నుమీదే దెబ్బతీసింది. వెక్కిరించింది. "నానమ్మా! నీ దగ్గిర బోల్డు డబ్బున్నదని,

అమ్మా, అమ్మమ్మా అంటూంటే విన్నాను, అబద్దం కదూ."

అబద్ధమే. సర్వాబద్ధం. ఆ స్థితి వుందన్న ఆలోచన ఇచ్చే సుఖం ఒకటే వుంది... ఆ స్థితిలేదు.

"నాన్నమ్మా. నాన్నెమో రేపువెళ్ళిపోతాట్ట. నువ్వొరిపి వున్నావు. నేను నీ దగ్గిర వుండిపోనా."

రత్తమ్మ కళ్ళమ్మట నీళ్ళు బొటబొటా కారాయి.

"నాన్నొప్పుకున్నా అమ్మ ఒప్పుకోలేదు. బలవంతాన్నైనా తీసుకుపోతానంటుంది. నాకు నీ దగ్గిరే ఉండిపోవాలనివుంది. అమ్మొచ్చి అడిగినా నన్ను పంపకూ. ఏం నాయనమ్మా, మాట్లాడవేం."

"నా దగ్గిర్నుంచి నిన్నెవరు తీసికెడతారే వెర్రికూచీ, మాటాడక పడుకో" అంది రత్తమ్మ పాపకాళ్ళూ, చేతులూ తనమీద వేసుకొని శాలువా కప్పి.

అనుకున్నట్టే మూడోనాడు వకుళాభరణం తండ్రితో సహా వచ్చేసింది.

"పిల్ల రానంటూందని రాస్తారు, మీకేమేనా మతుందనుకోనా. పోయిందనుకోనా. కడుపున పుట్టిన మిమ్మల్నందర్నీ మా అమ్మ యింతలా ఉద్ధరించిందీ, ఇక మనవల్ని బాగుచేస్తుందా. శుభకార్యానికైనా శుభ్రమైన చీరముక్క ఎరగనే..." అంటూ మొదలెట్టింది.

"నాలుగు రోజులకీ పిల్ల నల్లపూసైపోయిందం. ఓ సంరక్షణా వల్లకాడ. ఓ కమ్మని పెరుగా, ఓ చిక్కని పాలా.

వుంటే సరా, తినడానికి పెట్టిపుట్టాలిగాని..." అని లంకించుకుంది.

రత్తమ్మగారు మొట్టమొదటిసారిగా ఆనాడు పాలవాడితో మరోపావుశేరుపాలు ఎక్కువ తెమ్మంది. ఆ మాట అక్కడున్న అల్లుడు విని అందుకున్నాడు.

"ఎందుకత్తగారూ, లేనిపోని ఖర్చూ? ఈ జన్మానికి మీ హయాం యిలా వెళ్ళిపోనీయండి. మేం తెప్పించుకుంటాంలెండి. అంత మనసు ఉగ్గబెట్టుకొని మీరు తెప్పిస్తే మాత్రం పిల్లకి అరగొద్దూ?"

ఇలాంటి మాటలకు యేనాడూ ఓడిపోని రత్తమ్మ మనసు ఎందుకో గాయపడింది. వకుళం, తండ్రి అంతలా విసుక్కోడానికి కూడా కారణం లేకపోదు. పాపని వచ్చిననాడే తీసుకెళ్ళిపోదామనుకున్నారు. ఆ పిల్ల రానని పేచీ, పైగా కొంచెం ఒళ్లు వెచ్చగా వుంది కూడాను. అటుపైన వకుళం కూతుర్ని ఒకటేసింది.

"ఏం చూచుకుని నాన్నమ్మ దగ్గరికి పరుగెడుతున్నావే భడవకానా! కొంచెమేనా సిగ్గుండద్దూ? అయిదేళ్ళొచ్చాయి నీకు, అరతులం బంగారం ఎరుగుదువా? ఏం ఒరగబెడుతుందని ఆవిడ ఒళ్ళో దూరుతున్నావ్? ఇవతలికి వస్తావా రావా?"

"నాన్నమ్మా, చూడు నాన్నమ్మా!"

రత్తమ్మ పాపను దగ్గరగా లాక్కొంది.

"నీకేమైనా మతిపోయిందా ఏమిటే పిల్లా? ఎందుకలా

దాన్ని కాదుకుంటావ్, మధ్య అదేం చేసిందని? అయినా దాని ఒళ్లు చూడు ఎలా కాలిపోతూందో.

వకుళం కంగారుగా మొగుణ్ణి పిలిచింది. జ్వరం. చూశారు...పిల్లకు నూటనాలుగు వుంది. వెంటనే రంగమ్మ గారికి వైరిచ్చారు. ఆరాత్రి రైల్లో ఆవిడా కొట్టుకవచ్చింది.

"అయ్యో! అయ్యో! నిక్షేపంలా వున్నపిల్ల నిప్పులా ఉందేమిటే తల్లీ ఒళ్లూ."

"ఏమోనమ్మా. నేనేం చెయ్యను చెప్పు ఇది మానవ మాత్రులుండే కొంపకాదని ఏనాడో చెప్పాను. అయినాచిన్నది అది వస్తానని అల్లరిపెట్టినా పెద్దవాళ్ళం మనమేనా బలవంతం పెట్టి ఉంచెయ్యవలసింది. నేను పుట్టిబుద్ధెరిగాక ఈ ఇంటి గుమ్మానికి పచ్చనితోరణం ఎరగను. ఇదొక పాడుకొంప. ఇక్కడికెందుకొచ్చిపడిందే అమ్మా నా కూతురు?" అంటూ వకుళం రాగాలు ప్రారంభించింది.

"అయినా అమ్మా, అంటే నీకు కోపంరావచ్చుగాని నువ్వు చేసినపని యేమైనా బాగుంది? ఇల్లంతా అద్దెకిచ్చేసి ఒక్కటంటే ఒక్క గది మిగుల్చుకున్నావే, ఎవరేనా వస్తే ఎక్కడుంటాం అనుకున్నావ్? ఇంతలా యింట్లోవాళ్ళని యిబ్బంది పెట్టేక ఈ డబ్బు నువ్వు తినడానికా, బ్యాంకీ వాళ్లు తినడానికా?" అని రంగమ్మ తల్లిని తెగులుకుంది.

"ఏమాత్రం పిల్లకు నెమ్మళించినా రాత్రి రైల్లో వెళ్ళిపోదాం. నేనిక్కడుండలేను బాబూ" అంటున్నది వకుళం మొగుడితో.

"నాన్నమ్మా, చూశావా, నన్ను తీసికెళ్ళిపోతారుట.

చెప్పు నాన్నమ్మా. నీకు మాటలు రావా? మంచిదానివి కావా. నా జట్టు లేవా."

నోరెత్తకుండానే వచ్చిన వాళ్ళందరూ నువ్వూ అనకుండా దులిపి దుళ్ళగొడుతున్నారు. ఇంకా రత్తమ్మగారు నోరెత్తడానికి ఏముంది.

"ఈ శిలా హృదయానికి ఈ నాటికి ద్రవించడం తెలిసింది. ఇంకేం తెలీలేదు" అనుకుంది కళ్ళనీళు తుడుచుకుంటూ రత్తమ్మ.

ఓ రాత్రివేళ తుళిక్కిపడి లేచింది రత్తమ్మ. గదిలో ఎవరూ లేకపోతే హడలిపోయింది. దీపాన్ని ఎక్కువ చేసింది. పాప మాత్రం పడుకునివుంది. వంటిమీద చెయ్యేసిచూసింది. ఇంకా బాగా జ్వరంగానే వుంది. 'భయంబెట్లో కదే ఈళ్వగా' అనుకుందేమో రత్తమ్మ. దీపం తగ్గించి పిల్లకు ఒళ్ళంతాకప్పి, వీళ్ళంతా యేమయ్యారా అని వీధివైపు వచ్చింది. అద్దెకున్న వారి మధ్య హాల్లో కూచుని వీళ్ళంతా ఏదో చర్చిస్తున్నారు. ఈవిడ రావడం వాళ్ళు చూడలేదు. అద్దెకున్న రఘుపతిగారు కూడా ఆ చర్చలో పెద్ద పాత్రే వహించినట్టుంది.

"అయితే ఏమిటంటారు" అంది వకుళం.

"ఎన్నిసార్లు చెప్పను ఎంతయితేమాత్రం జ్వరంగ వున్న పిల్లను యెలా తీసికెడతాం. అంత జ్వరంతో తీసికెళ్ళడానికి ఏ డాక్టరు ఒప్పుకుంటాడు." అన్నాడు సుదర్శనం.

"మీకు కావలసిన సదుపాయం మేం చేస్తామన్నాముగా. కావలిస్తే ఈ గదిలో మీ సామాను పెట్టుకోండి.

ఇక్కడ పడుకోండి. అందరం పిల్లలున్న వాళ్ళమేగదా." అన్నాడు రఘుపతి.

"ఆ జ్ఞానం మా అత్తగారికుందా అని" అన్నాడు రంగమ్మ మొగుడు.

రత్తమ్మ ఈ మాటవిని ఆచీకట్లో కూలబడడం బహుశా ఎవరూ చూసి వుండరు. రఘుపతి ఆశ్చర్యకరంగా ఆవిడ పక్షాన వాదించాడు.

"వచ్చిందగ్గర్నుంచీ చూస్తున్నాను. మీ ఇంట్లో అందరూ ఆవిడమీద ఒంటికాలిమీద లేస్తున్నారు. ఇంటికి పెద్ద అయినదాన్ని, నెత్తిమీద పెట్టుకోవలసినదాన్ని ఎందుకలా అడ్డమైన మాటలు అంటున్నారో నాకు అర్థం కావడంలేదు. మీరందరూ ఇంతింత వాళ్ళయారంటే ఆవిడ కడుపు చలవే గదా. ఆవిడకు మీ అందరికంటె డబ్బే ఎక్కువంటున్నారు, మీకు మాత్రం. ఆవిడకంటె ఆవిడ డబ్బే మీకు ఎక్కువ కాలేదా? ఇంతకూ ఆవిడమాత్రం ఇంత ఆస్తి మీకివ్వక ఏం చేస్తుంది. చచ్చేక నాలుగు కొమ్ములకూ యింతింత మూటలు కట్టించుకుని పట్టుకెడుతుందా."

"పట్టుకెడుతుందనే నా నమ్మకం..." అన్నాడు రంగమ్మ మొగుడు.

"ఓ అందుకు సందేహమా" అంది పకుళాభరణం.

"ఏ మనిషయినా అంతలా దిగజారిపోయిందంటే నేను నమ్మను."

"మీరీ యింట్లో వుంటూ కూడా నమ్మకపోతే మేమేం చెయ్యం. తన మటుకు తనే చూసి చూసి కాణీ ఖర్చు పెట్ట

కోలేనంత లుబ్ధత్వంలో మునిగిఉన్న మనిషి యిక ఎదుటి వాళ్ళకు కూడా యేం ఖర్చు పెడుతుంది. మేమయితే పై వాళ్ళం. కడుపున పుట్టిన బిడ్డలే ఇక్కడున్నారుకదా, వాళ్ళను అడగ రాదూ."

"ఏమండీ రంగమ్మగారూ ఏమిటంటారు."

రత్తమ్మ ఒళ్ళంతా చెవులు చేసుకొని జవాబుకోసం క్షణం ఒక యుగంగా నిరీక్షించింది. తనరక్తం పంచుకుని పుట్టినబిడ్డ తనగురించి యేమంటుందిట.

"ఎవరికీ తెలీని భాగోతమని మళ్ళీ నాచేత చెప్పిస్తారు అన్నగారూ! కన్నకూతుర్ని నాదగ్గిర పన్నెండువేల రూపాయలు కట్నం పుచ్చుకుంది. అదిచాలక వెయ్యిరూపాయలం లాంఛనాలను గుంజింది. ఇహానికీ, పరానికీ, నిజానికీ, ధనానికీ ముడిపెట్టిన ఇల్లాలు ఆవిడ. ఆవిడకు మానాలూ లేవు. అభిమానాలూ లేవు."

ఒక్కొక్కమాట ఒక్కొక్క పోటుగా భరించింది రత్తమ్మ. ఆతరువాత తనగురించి ఒక్కగా నొక్కడైన తన కొడుకు అభిప్రాయమూ ఆవిడమనసును పిప్పిచేస్తున్నట్టే అనిపించింది.

"మనిషి మనిషీ వేరే చెప్పేదేముంది రఘుపతిగారూ! మా అమ్మకి ఆమాత్రం మానవత్వమే ఉంటే ఈ ఊళ్ళో బియ్యీడీ ఉండగా నేను యెక్కడో ట్రెయినింగు కావడం దేనికి ? ఇంట్లోంచి ఒక్క కొడుకూ వెళిపోతూంటే అదే మహా బాగనుకుంది గాని మాటవరసకేనా ఇక్కడ వుండమని

అనలేదే! నాన్నప్రాణం పోయినా చూస్తూ ఊరుకుందిగాని విశాఖపట్నం తీసికెళ్ళి చూపించలేదే!"

రత్తమ్మ పరుగుపరుగున పాపమంచందగ్గరకు వెళ్ళింది: నిద్రపోతున్న పిల్లని లేవదీసి కూచోబెట్టింది.

"ఎందుకేడుస్తున్నావ్ నాన్నమ్మా నీకు నేను ఉన్నానుగా!"

రత్తమ్మ ఏడ్చేసింది. బాధతోపాటు దుఃఖంకూడా పైకి కనబడనీయకుండా. వినబడనియకుండా కుళ్ళి కుళ్ళి ఏడ్చింది. లోలోపలే వెక్కి వెక్కి స్రుక్కి స్రుక్కి ఏడ్చింది. అప్రయత్నంగా ఆమెదృష్టి ఖాళీగావున్న ఉయ్యాలమీద పడింది.

"ఇదిగో, ఎక్కడా... వుంటున్నారుకదూ!"

ఇంకా పూర్తిగా చెప్పకుండానే జోగయ్యగారు మాట్లాడ్డంప్రారంభించారు. బ్రతికుండగా యెప్పుడూ పెళ్ళాం యెదుట నోరుమెదపడం యెరగని జోగయ్యగారు చచ్చాక ధారాళంగా ఉపన్యసించడం నేర్చారా అనిపించింది.

"నీ మొహాన్ని నా మొహాన్ని అలా రాసిపెట్టి ఉన్నప్పుడు ఏంచేస్తాంమరి. బ్రతికున్నన్నాళ్ళూ నన్ను కీలుబొమ్మను చేసి నోరూవాయీ లేకుండా చేశావు. ఇక ఇప్పుడు నీవంతు వచ్చింది. చడీ చప్పుడూ లేకుండా అగ్నిహోత్రాన్ని అంతరంగంలో యెలా దాచుకోడమో కొంచెం రుచిచూడు మరి."

"నన్నొదలి ఎక్కడికెళ్ళిపోయావ్ నాన్నమ్మా."

అంతజ్వరంతోనూ ఉన్నపాప గబుక్కున లేచి నాలుగడుగులువేసి రెండుచేతులూ జాచింది. రత్తమ్మగారు పాపను

ఎత్తుకుని ముద్దెట్టుకుంది. పక్కలో పడుకోబెడదామంటే పాప చంక దిగడానికి ఒప్పుకోలేదు.

"కడుపునపుట్టిన బిడ్డలుకూడా నన్ను కుక్కకన్నా హీనంగా చూస్తున్నప్పుడు నన్ను చుట్టబెట్టుకుంటావెందుకే వెర్రితల్లీ. ఇంతలా నన్ను పూసుకు తిరగటానికి నేను నీకు చేసిందేమిటే."

"అమ్మా వాళ్లూ ఏరీ" అని అడిగింది పాప.

"వీధిహాల్లో ఉన్నారుపద" అని రత్నమ్మగారు పాప నెత్తుకుని వస్తూంటే మళ్ళీ మాటలు వినబడి కొంచెం ముందుగా ఆగింది.

రఘుపతి అంటున్నాడు. "ఏమో అనుకున్నాను నేను. ఏదేమైనా తల్లీ పిల్లలూ కాకపోతారా అనుకున్నాను. మీకు ఆవిడమీద అలాంటి అభిప్రాయమున్నప్పుడూ ఆవిడ అంతటి బ్రహ్మరాక్షసి అయినప్పుడూ పిల్లను తీసుకెళ్ళిపోవడమే మంచిది... టాక్సీ మాట్లాడి తీసుకెళ్ళవచ్చు."

అయితే వెంటనే తీసుకెళ్ళిపోవడం మంచిదేమో!... పిల్ల లేచిందంటే మళ్ళీ పట్టుకోడం కష్టం" అంది వకుళం.

"పిచ్చేమైనా మతిపోతుందా ఏమిటే అమ్మాయ్! ఇంతటి అర్ధరాత్రి, చిన్న చినుకుకూడా పడుతున్నట్టుంది, జ్వరంతో ఒళ్ళెరగనిదాన్ని ప్రయాణం చేస్తావా. తెల్లారేక తప్పకుండా తీసుకెళ్ళిపోదాంలే."

"ఊ నేను రానూ..." అని పాప కాళ్లూ చేతులూ కొట్టుకోడం ప్రారంభించింది, అందరూ ఇటు తిరిగారు.

పిల్లను బలవంతాన రత్తమ్మ చేతిలోంచి లాక్కుంది వకుళం.

“చూశారా చూశారా! పెంచి పెంచి ఈమాటలు వినడం చూశారా. అర్ధరాత్రివేళ పడుకొన్న గంటముండని లేపి దానిమనసు విరిచేసి ఏమందో పెట్టినట్టు తనవైపుకు తిప్పుకోడం చూశారా. తల్లికీ, పిల్లకీ ఈ తెగతెంపులు చెయ్యటం చూశారా. మేం ఇలాగేనా బతికుండడమెందుకని కత్తికట్టడం చూశారా.”

పాప ఏడుపు వినబడనంత గట్టిగా వకుళాభరణమే ఏడుపు మొదలుపెట్టింది.

“ఇన్ని వింటూ ఇన్ని చూస్తూ ఇంకా ఇక్కడ ఉండ మంటారా! ఏమండీ ఇంకా చూస్తారేం. నాన్నా ఇంకా నిలబడే వున్నావేం. ఈవీధిచివర ఏరాత్రివేళయినా టాక్సీలు దొరుకుతాయట వెళ్ళి పిల్చుకురావేం? అమ్మా ఇంకా కదలవేం? సామాన్లు నాలుగూ సర్దించి కారులో పెట్టించవేం? ఏమే పాప, ఇంకా నోరుముయ్యవేం, ఇంకా నీకు బుద్ధిరాదేం.

అన్నీ నిమిషాలమీద జరిగిపోయాయి. ఇంకో అర గంటకు అక్కడ రత్తమ్మ, ఒక్కగదీ, చిన్న వసారా ఖాళీగా వున్న ఊగుటుయ్యాలా, పాప పాతిన ఎండిపోయిన తమల పాకుల తీగా మిగిలాయి.

ఇంటిల్లిపాదీ లేచి వెళ్ళిపోతున్నప్పుడు మాటవరసకేనా అదేమని అడ్డుపడలేదు. చంటిపాపనేనా దగ్గరికి తీసుకోలేదు.”

“ప్రపంచంలో వేరే జీవచ్ఛవం యెక్కడో లేదు” అన్నది అద్దెకున్నావిడ.

"అ...వు...ను...జీవచ్ఛవాన్ని. అదే నాకు తగిన మాట" రత్నమ్మ రసలేశంలేని పొడినవ్వు నవ్వింది. అది చలనవిహీతమైన నవ్వు, చైతన్య రహితమైన నవ్వు, చావు దగ్గరపడినవాళ్ళ నవ్వు.

అంతే. వారంరోజులతర్వాత ఆ ఇంట్లో కొబ్బరిచెట్టు క్రింద మట్టలు ఏరుతున్నవాళ్ళూ, అరటిచెట్టుకింద బోది చేస్తున్నవాళ్ళూ, వరండాలో కూచుని నిశ్చింతగా తమల పాకులు వేసుకుంటున్నవాళ్ళూ లేకపోయారు. అంతేకాదు, మనవరాలు ఇంట్లోంచి వెళ్ళిపోయాక ఆవిడ మరి మడిగట్టుకో లేదనే చెబుతారు.

అర్థరాత్రివేళ అందరూ నిద్రపోయేవేళ అదేపనిగా చినుకులు పడుతున్నవేళ ఆత్మీయతా, ఆప్యాయతా అంద కుండా వెళ్ళిపోయినవేళ...ఆవేళ అద్దేవేళ, రత్నమ్మలోని యేశక్తో మేలుకొంది. దేన్నో పోల్చుకుంది. యేమిటో నిశ్చయం చేసుకుంది. మూడోనాటికే తమ్ముడు వచ్చిపడ్డాడు. టెలిగ్రాం యిచ్చి పిలిపించింది. పన్నెండెకరాలభూమి ఆ క్షణానికి యెంతొవస్తే అంతకి అమ్మించేసింది. అదేమని వాడు అడక్కుండా ఓ వందరూపాయలు యిచ్చి తమ్ముడినోరు మూసింది. సేటుబ్యాంకిలో ఉన్న అయిదువేలూ తనపేరున తీసేసుకుని ఎకౌంటు క్లోజుచేయించేసింది.

"ఇదేమిటండీ! ఈమెకేమైనా మతిపోలేదుగద!"

"మతిపోవడమేమిటే ఇప్పటికైనా యెవరిదివాళ్ళకు పారేద్దామని పుట్టిందికాబోలు! సంతోషించవలసిందే. ఐనా

రోజురోజుకూ మనిషి ఎంతలా దిగజారిపోతుందో తెలియడం లేదూ! ఈ నాలుగురోజులకే యేదోలోకంలో ఉన్నట్లు తయారైంది. కనిపించడం లేదూ! ఇంకెన్నాళ్ళో బతకదు. వాళ్ళ వాళ్ళకు వైరియ్యడం మంచిది” అన్నాడు రఘుపతి.

రత్తమ్మతెమ్ముడు మాత్రం ఇంకేదో ఆలోచిస్తున్నాడు. వెళ్ళిపోతూ అక్కతో అన్నాడు. “అక్కయ్యామ్మ, గంపెడు పిల్లల్తో ఉన్నాను. నన్ను అన్యాయం చెయ్యవుకదూ నా పేర్న కూడా ఏదో నీకు తోచినంత...”

రత్తమ్మ నవ్వింది. తడీపొడీ లేని నవ్వు. చడీచప్పుడూ లేనినవ్వు. మొట్టమొదటి నవ్వు: చిట్టచివరినవ్వు:

♦ ♦ ♦

కాలిపోతున్న తల్లిశవంకేసి చూస్తూ పైచెంగుతో కళ్ళనీళ్లు తుడుచుకున్నాడు సుదర్శనం. ఎంత త్వరలో యెంత జరిగింది.

“చచ్చిపోయేటప్పుడు ఒంటిమీద బట్టయినా ఉంచరంటారు. మరి ఇదేమిటి ఈవిడని ఈచీరతో చితెక్కించారు.” అని ఎవరో అడిగారు.

“చీరేకాదు! తాతలనాటి బొంతతోకూడ ఈవిణ్ణి తగలేశారట! చచ్చేముందు కొడుకును పిలిపించుకుని పాతికేళ్ళ క్రిందట ఆవిడతల్లి యిచ్చిన బొంతట, దానితో తనను తగలెయ్యమని ఆఖరి కోరికగా చెప్పి కొడుకుచేత చేతిలో చెయ్యి వేయించుకొని మరీ కన్నుమూసిందట. పెద్రితల్లి బతికున్న

న్నాళ్లూ ఒక్కనాడయినా కావలసింది కొనుక్కోగలిగిందా; తినగలిగిందా? వెళ్ళేటప్పుడు ఓ కాని అయినాకూడా పట్టుకెళ్ళగలిగిందా? ఆవిడకంతే రాసిపెట్టుంది. అదే జరిగింది.

ఇవన్నీ వినడానికి సుదర్శనానికేమీ సహనం లేకపోయింది. పరుగుపరుగున ఇంటిదారి పట్టాడు. అమ్మ ఆస్తంతా అమ్మేసి నగదురూపంలోకి మార్చిందని అతను విన్నాడు. ఇంతయెత్తున నూర్రూపాయల కట్టలట! ఎంతలేదన్నా ముప్పై వేలకు తక్కువ ఉండదట. తనతోపాటు వద్దనకుండా వినకుండా రంగక్కా, బావా, వకుళం అందరూ వెంటబడ్డారు. ఈపాటికి ఇనప్పెట్టె తాళాలు దొరికాయేమో, ఆ నోట్లకట్ట బయటపడిందేమో, యెవరిచేతిలో పడిందో ఏమిటో సొద. సొమ్ము పాపిష్టిదంటారు. అదృష్టవశాత్తూ సుదర్శనం ఇంటికి వెళ్ళేలోపున యెవరికీ దొరకలేదు. నలుగురూ ఒకళ్ళమించి ఒకళ్ళు, ఒకరికంటె ముందు మరొకరు తాళాలగుత్తికోసం గాలించారు. ఎలా అయితేనేం' ఆఖరికి తాళాలు దొరికాయి. అతి ఆత్రంగా అందరూ ఒకళ్ళనొకళ్ళు వెయ్యికళ్ళతో గమనిస్తూండగా ఇనప్పెట్టె తెరవబడింది. అందులో ఏమీలేదు. నాలుగుమడతలు పెట్టబడిన చిన్న కాగితంముక్కతప్ప! అందులో ఇలా ఉంది:

"ప్రపంచంలో అతిముఖ్యమైనవన్నీ పొందడానికి అత్యావసరమైనధనలక్ష్మిని కించపరచిన మహాపాపం నన్నుచుట్టుకుంటే చుట్టుకోగాక! ఈ చివరిక్షణంలో నాకుభయమూ లేదు. విచారమూలేదు. మానవత్వాన్ని మంటగలిపి నాకింతఅపకారంచేసిన

ఈ పాపిష్టిసొమ్ము నా కడుపునపుట్టిన బిడ్డలకుకూడా అపకారం చెయ్యదని నాకేం నమ్మకంలేదు. ధనంమీద వ్యామోహం ఎంతటిదంటే ఆఖరుక్షణాలలోకూడా ఐదారుసార్లు ప్రయత్నించినా నాచేతుల్తో నేను కిరసనాయిలుపోసి ఆ నోట్లకట్టను అంటించలేకపోయాను. పతితపావనుడైనభగవంతుడికి నాఆఖరి ప్రార్థన యిదే. ట్లు మభ్యపెట్టి కుట్టిన ఆబొంత ఈపాటికి బూడిద అగుగా . నా ఆ స్తికథ నాతోనే అంతమై నా పిల్లలలో ఆ స్తికత పెరుగుగాక.

—•◆•—